భార్యతో వివాహేతర సంబంధం.. మేనల్లుడిని
కారుతో ఢీ కొట్టి చంపిన మామ 7

సుపారీ గ్యాంగ్‌తో హత్యకు ప్లాన్
ఎనిమిది మంది అరెస్టు

చెరకు టన్నుకు రూ.500 బోనస్ ప్రకటించాలి

చెరకు రైతుల సమస్యలను మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ సురేష్‌శెట్కార్‌లకు వివరించిన నిర్మలాజగ్గారెడ్డి




చెరకు రైతుల సమస్యలను మంత్రి శ్రీధర్‌బాబుకు వివరిస్తున్న నిర్మలాజగ్గారెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ సురేష్‌శెట్కార్‌తో నిర్మలాజగ్గారెడ్డి, సీడీసీ చైర్మన్‌లు

సంగారెడ్డి టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని చెరకు రైతులకు రూ.500 బోనస్ ప్రకటించాలని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి కోరారు. శనివారం రాష్ట్రంలోని ఏడుగురు సీడీసీ చైర్మన్‌లతో కలిసి జహీరాబాద్ ఎంపీ సురేష్‌శెట్కార్, రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబును నిర్మలాజగ్గారెడ్డి కలిసి చెరకు రైతుల సమస్యలను వివరించారు. చెరకు రవాణా కోసం టోల్‌గేట్ రుసుం మాఫీ చేయాలన్నారు. సీడీసీల ద్వారా నిధులు మంజూరు చేసి యాంత్రీకరణ పథకాన్ని అమలు చేయాలన్నారు. పరిశ్రమలకు చెరకును సాఫీగా రవాణా చేసేలా అంతర్గత రోడ్ల నిర్మాణానికి నిధులు సమకూర్చాలన్నారు. చెరకు రైతులకు డ్రిప్ ఇరిగేషన్ కోసం నిధులను కేటాయించాలని నిర్మలాజగ్గారెడ్డి సీడీసీ చైర్మన్‌ల పక్షాన మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ సురేష్‌శెట్కార్‌లను కోరారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి సీడీసీ చైర్మన్ గడీల రాంరెడ్డి, గాయత్రి, గణపతి, మధుకాన్, కాకతీయ, కృష్ణవేణి, గంగా కావేరి చెరకు పరిశ్రమల పరిధిలోని సీడీసీ చైర్మన్‌లు తదితరులు పాల్గొన్నారు.

గడిపెద్దాపూర్‌లో మొసళ్ల కలకలం 7
రెండు చెరువుల్లో ప్రత్యక్షం.. అప్రమత్తంగా ఉండాలని దండోరా



సమావేశమైన బీఆర్ఎస్ ముఖ్య నాయకులు

పటాన్‌చెరులో 'ఢీ'ఆర్ఎస్

సమన్వయం కోసం సమావేశం

ఎవరికి వారేగా నాయకుల తీరు

పార్టీ మారిన వారిని ఎందుకు కలుస్తున్నారంటూ ప్రశ్న

అంతా మీ వాళ్లే అని సమాధానం

నన్ను ఒక ప్రాంతానికే పరిమితం చేస్తే ఎలా..?


ఆసక్తికరంగా బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశం

స్థానిక ఎన్నికల పరిశీలకుల నియామకం

పటాన్‌చెరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల నేపథ్యంలో నిర్వహించిన టీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ నేతల సమన్వయ సమావేశం వాడీవేడిగా జరిగినట్లు తెలిసింది. నియోజకవర్గంలోని గుమ్మడిదల మండలంలో ఎనిమిది, పటాన్‌చెరు మండలంలో మూడు గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో చర్చించడానికి పార్టీ కోఆర్డినేటర్ ఆదర్శరెడ్డి ఆధ్వర్యంలో పటాన్‌చెరులో కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్ నివాసంలో నేతలు సమావేశమయ్యారు. ముందుగా మెట్టుకుమార్‌యాదవ్ మాట్లాడుతూ ఎమ్మెల్యేగా పోటీచేయాలనుకునే నాయకులు అందరినీ కలుపుకుపోవాలని సూచించారు. దీనిపై స్పందించిన కోఆర్డినేటర్ ఆదర్శరెడ్డి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేతో ఎందుకు కలుస్తున్నారని ప్రశ్నించారు. దీనిపై స్పందిస్తూ ఎమ్మెల్యే చుట్టూ మీవాళ్లే ఉన్నారంటూ రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంటు అంజయ్యయాదవ్ బదులిచ్చారు. ఎమ్మెల్యే దగ్గరికి ఎన్నో పనుల కోసం వెళ్తుంటామని జిన్నారం మండల నాయకుడు వెంకటేష్ గౌడ్ అన్నారు. దీనిపై ఆదర్శరెడ్డి స్పందిస్తూ తాను మరే ఉద్దేశంతో అనలేదని, నియోజకవర్గ ప్రజాప్రతినిధిని ఎవరైనా కలుసుకోవచ్చని చెప్పారు. పార్టీ మీటింగ్‌ల సమాచారం స్థానికులకు ఎందుకు ఇవ్వడం లేదని తెల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ రాములుగౌడ్ ప్రశ్నించారు. మాజీ జడ్పీటీసీ కొలన్‌బాల్‌రెడ్డి మాట్లాడుతూ తనను ఐడీఏబొల్లారానికి పరిమితం చేయడం తగదని, అన్ని ప్రాంతాల్లో తిరగడానికి అవకాశం ఇవ్వాలని అన్నారు. పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు అందరం కష్టపడాలని సీజీఆర్ ట్రస్టు చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో ఉప ఎన్నికలు వస్తే ప్రతి ఒక్కరు అధిష్టానం సూచనల ప్రకారం పని చేయాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం

మిగతా 8వ పేజీలో

ముగ్గురి కోసం.. ముగ్గురు



పెండింగ్‌లోనే సంగారెడ్డి డీసీసీ అధ్యక్ష పదవి

తమవాళ్లకే ఇవ్వాలని

మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే పట్టు

పంచాయతీ ఎన్నికల తర్వాతే ప్రకటన

అప్పటిదాకా నిర్మల జగ్గారెడ్డి కొనసాగింపు

సంగారెడ్డి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లాలకు కాంగ్రెస్ అధ్యక్షులను శనివారం ప్రకటించారు. ఉమ్మడి జిల్లాలోని మెదక్, సిద్దిపేట జిల్లాలను సైతం ఈ జాబితాలో చేర్చారు. కానీ, సంగారెడ్డి డీసీసీ అధ్యక్ష పదవిని పెండింగ్‌లో పెట్టడం చర్చనీయాంశంగా మారింది. ముగ్గురు ఆశావహుల కోసం ముగ్గురు కీలక నేతలు పావులు కదపడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పార్టీ అధిష్టానం తర్జనభర్జన పడి చివరకు సంగారెడ్డి జిల్లాను పక్కనబెట్టింది.

పోటాపోటీగా పావులు

ఇటీవల సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం దరఖాస్తులు స్వీకరించారు. పోటీలో ప్రధానంగా జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన ఉజ్వల్‌రెడ్డి, నారాయణఖేడ్ నియోజకవర్గానికి చెందిన నగేశ్ షెట్కార్, చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు. ఉజ్వల్‌రెడ్డికి మంత్రి దామోదర్ రాజనర్సింహ పూర్తి మద్దతు ప్రకటించారు. తన సోదరుడు నగేశ్ షెట్కార్ కోసం జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ ప్రయత్నం చేశారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి సోదరుడు చంద్రశేఖర్ రెడ్డి కూడా అధ్యక్ష బరిలో ఉన్నారు. ఎవరికివారు ముఖ్యనేతలు తమవాళ్ల కోసం పావులు కదిపారు. కాంగ్రెస్ కార్యకర్తలు, రెడ్డి కూడా అధ్యక్ష బరిలో ఉన్నారు. ఎవరికివారు ముఖ్య నేతలు తమవాళ్ల కోసం పావులు కదిపారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ఇతర నేతల అభిప్రాయాలు సైతం ముగ్గురూ దక్కించుకున్నారు. రాజీ కుదిర్చేలా అధిష్టానం ప్రయత్నించినప్పటికీ సఫలం కాలేదు. దీంతో సంగారెడ్డి జిల్లా డీసీసీ పదవిని పెండింగ్‌లో పెట్టినట్లుగా అర్థమవుతోంది.

ఎన్నికల తర్వాతే..

ముగ్గురు కీలక నేతలు డీసీసీ పోస్టు విషయంలో పట్టు సడలించకపోవడంతో ఎన్నికల తర్వాతే ఒక నిర్ణయానికి వచ్చేలా టీపీసీసీ యోచించినట్లు తెలుస్తోంది. ఎవరో ఒకరిని ఎంపిక చేస్తే మిగితా ఇద్దరు అసంతృప్తికి లోనవుతారని గ్రహించి పెండింగ్‌లో పెట్టినట్లు సమాచారం. ఈ ప్రభావం ఎన్నికల ఫలితాలపై పడుతుందని అంచనాకు వచ్చి ఒక్క సంగారెడ్డి జిల్లాను మాత్రం జాబితాలో చేర్చలేదు. పంచాయతీ, స్థానిక ఎన్నికల తర్వాతనే కొత్త అధ్యక్షుడిని ఎంపిక చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. అప్పటిదాకా ప్రస్తుత డీసీసీ అధ్యక్షురాలు, టీజీఐఐసీ చైర్‌పర్సన్‌గా ఉన్న నిర్మల జగ్గారెడ్డిని కొనసాగించనున్నట్లుగా తెలుస్తోంది. తాము చెప్పినవారికే డీసీసీ ఇవ్వాలని, లేదంటే పాతవారినే కొనసాగించాలని ముగ్గురు నేతలు కూడా తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చినట్లుగా తెలిసింది.

మెదక్ డీసీసీ పీఠం ఆంజనేయులు గౌడ్‌కే



మెదక్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి మళ్లీ ఆంజనేయులుగౌడ్‌నే వరించింది. డీసీసీ అధ్యక్షుడి ఎంపిక కోసం తొలిసారి ఏఐసీసీ పరిశీలకులు నియోజకవర్గాలవారీగా సభలు నిర్వహించి కార్యకర్తల అభిప్రాయాలు సేకరించారు. పదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత పదవుల నియామకం చేపట్టడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నెలకొంది. అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల సమయంలో పదవులు ఆశించి భంగపడ్డ నేతలు, ఏళ్ల తరబడి కష్టపడ్డ నాయకులకు పార్టీ పదవుల్లో పెద్దపీట వేస్తామని అధిష్టానం ప్రకటించింది. మెదక్ జిల్లా అధ్యక్ష పదవికి ప్రస్తుత ఇన్‌చార్జి డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, రాజా రెడ్డి మొదట నామినేషన్లు వేశారు. పాపన్నపేట మండలానికి చెందిన పబ్బతి ప్రభాకర్ రెడ్డి, రామాయంపేట నుంచి సుప్రభాతరావు, రమేష్ రెడ్డి, తదితరులు నామినేషన్లు దాఖలు చేశారు. శనివారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మెదక్ జిల్లా డీసీసీ అధ్యక్షుడిగా శివన్నగారి ఆంజనేయులు గౌడ్ పేరు ప్రకటించారు. సాధారణ ఎన్నికలకు ముందు డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి పార్టీకి రాజీనామా చేయడంతో ఆంజనేయులు గౌడ్‌కు డీసీసీ ఇన్‌చార్జి బాధ్యతలను అధిష్టానం అప్పగించింది. అనంతరం జిల్లాలోని మెదక్ అసెంబ్లీ స్థానాన్ని మైనంపల్లి రోహిత్‌రావు గెలుపొందడం నైతికంగా ఎంతో బలాన్నిచ్చింది. అన్ని సమీకరణాలను పరిగణనలోకి తీసుకున్న పార్టీ అధిష్టానం ఆంజనేయులు గౌడ్‌కు మరోమారు డీసీసీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు.

వరికొయ్యలకు పెట్టిన నిప్పు అంటుకుని రైతు సజీవదహనం



నర్సింహులు (ఫైల్)

పాపన్నపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వరికొయ్యలకు పెట్టిన నిప్పు ప్రమాదవశాత్తు అంటుకుని ఓ రైతు సజీవదహనమయ్యాడు. ఈ ఘటన మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని పొడ్చన్‌పల్లి గ్రామంలో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన రైతు బగుడం నర్సింహులు ఇటీవల ఖరీఫ్ పంటను కోశాడు. తిరిగి యాసంగి పంట వేసేందుకు భార్య సులోచనతో కలిసి పొలంలోని వరికొయ్యలను కాల్చి వేసేందుకు వెళ్లాడు. భార్య సులోచన ఒకపక్క, నర్సింహులు మరోపక్క ఇతరుల పొలాల్లోకి మంటలు వెళ్లకుండా చూస్తున్నారు. ఈక్రమంలో మంటలు పక్క పొలంలోకి వ్యాపించడంతో వాటిని ఆర్పేందుకు నర్సింహులు ప్రయత్నించాడు. కాలు సరిగా పనిచేయని నర్సింహులు ప్రమాదవశాత్తు పొలంలో పడిపోగా మంటలు చుట్టుముట్టడంతో అక్కడే సజీవదహనం అయ్యాడు. కొంతదూరంలో ఉన్న భార్య కొద్దిసేపటి తర్వాత భర్త కనిపించపోవడంతో వెతకగా, కాలిపోతున్న భర్తను చూసి బోరుమంది. పరుగున వెళ్లి గ్రామస్థులకు విషయం చెప్పినా వారు వచ్చేసరికే నర్సింహులు మృతిచెందాడు. సులోచన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.



నర్సాపూర్‌లో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

మహిళల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

మెదక్ జిల్లాలో మహిళలకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు

కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి

నర్సాపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. నర్సాపూర్ నియోజకవర్గంలోని మండలాలకు చెందిన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, చీరల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, కలెక్టర్ రాహుల్ రాజ్‌తో కలిసి పంపిణీ చేశారు. సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 1.27లక్షల కుటుంబాలకు ఉచిత కరెంటు ఇస్తున్నామని, లక్ష 26వేల కుటుంబాలకు 500 రూ.గ్యాస్ కనెక్షన్ అందించామన్నారు. మెదక్ జిల్లాలో వంద కోట్ల రూపాయల సబ్సిడీని మహిళల ప్రయాణం ద్వారా ఆర్టీసీకి అందించామన్నారు. రూ. 21 కోట్ల వడ్డీ లేని రుణాలు అందించామని తెలిపారు. మహిళలు వివిధ వృత్తుల్లో ప్రావీణ్యం పొందేలా మెదక్ జిల్లాలో త్వరలో స్కిల్ డెవలప్‌మెంటు సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. తెల్లరేషన్ కార్డు ఉన్న 18 సంవత్సరాలు నిండిన మహిళలకు చీరలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

సమస్యలు ఏకరవు

నియోజకవర్గంలోని పలు సమస్యలను మంత్రి వివేక్‌వెంకటస్వామి దృష్టికి తీసుకువెళ్లారు. ఇన్‌చార్జి మంత్రిగా సమీక్ష సమావేశం ఏర్పాటు చేయకపోవడంతో సమస్యలు పేరుకుపోతున్నాయన్నారు. మంత్రి రాక కోసం కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో నెలల తరబడి జాప్యం చేయడం తగదన్నారు. సింగూరు నుంచి జిల్లాలో రెండో పంటకు నీటిని వదలాలని కోరారు. ఎమ్మెల్యేనైన తనకు సమాచారం ఇవ్వకుండా కొందరు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. అనంతరం నర్సాపూర్ రాయరావు చెరువులో ఉచిత చేపపిల్లలను వారు వదిలారు. డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌చిర్జి ఆవులరాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రంగులు వేస్తున్న పెయింటర్లు

ప్లంబర్ల కమాల్‌పూర్.. పెయింటర్ల షేర్‌పల్లి

ఇంటికొకరు చొప్పున.. ఊరంతా వారే

ఉపాధి కోసం వలస వెళ్లి.. పని నేర్చుకుని వచ్చి

తమ గ్రామస్తులకు దారి చూపిన వృత్తికారులు

భవన నిర్మాణ కార్మికులుగా గుర్తించి, బీమా, పెన్షన్ సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి

7లో



రైల్వే ఓవర్‌బ్రిడ్జి పనులు పూర్తిచేయండి

చేగుంట-వడియారం మార్గాన్ని జీరో యాక్సిడెంట్ జోన్‌గా నిలపాలి : మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

మెదక్ అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): చేగుంట-వడియారం రైల్వేగేట్ వద్ద నిర్మాణంలో ఉన్న ఓవర్ బ్రిడ్జి పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. రైల్వే, ఫారెస్ట్, అర్‌అండ్‌బీ, పంచాయతీ, మిషన్ భగీరథశాఖల అధికారులతో కలెక్టరేట్‌లో శనివారం ఆయన సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులు పెండింగ్‌లో ఉండడంతో వాహనదారులు, అంబులెన్స్‌లు, అత్యవసర సేవల వాహనాలకు తీవ్ర అంతరాయం కలుగుతోందన్నారు. రద్దీ సమయంలో పాదచారులు రైల్వే ట్రాక్ దాటేందుకు ప్రయత్నిస్తుండటంతో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. ఆర్వోబీ పనులు పూర్తిచేసి సర్వీస్ రోడ్డు, డ్రైనేజీ, లైటింగ్, సిగ్నలింగ్ వంటి అనుబంధ సదుపాయాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రాబోయే రోజుల్లో ఈ మార్గం జీరో యాక్సిడెంట్ జోన్‌గా నిలవాలని సూచించారు. మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ రైల్వే, అర్‌అండ్‌బీ, ఇతర శాఖాధికారులందరూ సమన్వయంతో పనులు చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు ఏస్పీ మహేందర్, డీఆర్వో భుజంగరావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● హత్నూర: మండల పరిధిలోని సిరిపురం గ్రామ పంచాయతీలో పోస్టాఫీస్‌కు సొంత భవనం మంజూరు చేయాలని మాజీ సర్పంచ్ మచ్చ నరేందర్, నాయకులు సత్యనారాయణగౌడ్ ఆధ్వర్యంలో గ్రామస్థులు శనివారం ఎంపీ రఘునందన్‌రావును కలిసి విన్నవించారు.

అదుపు తప్పి ఆటో బోల్తా .. ముగ్గురు మహిళలకు గాయాలు

బెజ్జంకి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అదుపు తప్పి ఆటో బోల్తాపడి ముగ్గురి మహిళలకు గాయాలైన సంఘటన బెజ్జంకి మండలంలోని దాచారం స్టేజీ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని దేవక్కపల్లికి చెందిన వీవోఏ సౌజన్య, మరో ఇద్దరు మహిళలు శనివారం బెజ్జంకిలో ఇందిరా మహిళ శక్తి చీరల పంపిణీ కార్యక్రమానికి వచ్చారు. అనంతరం గ్రామంలో చీరలను పంపిణీ చేసేందుకు ఆటోలో తీసుకోని వెళ్తుండగా దాచారం స్టేజీ వద్దకు వెళ్లగానే ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఆటోలోని ముగ్గురి మహిళలకు గాయాలుకాగా 108 అంబులెన్స్‌లో కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



దాచారం స్టేజీ సమీపంలో బోల్తా పడిన ఆటో

పాఠశాలలో గ్యాస్ లీకై చెలరేగిన మంటలు



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

గజ్వేల్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ఓ ప్రాథమిక పాఠశాలలో శనివారం పెను ప్రమాదం తప్పింది. వివరాలు ఇలా ఉన్నాయి. సంగుపల్లి ప్రాథమిక పాఠశాలలో వంట చేస్తున్న క్రమంలో గ్యాస్ లీక్ కావడంతో వంటగదికి మంటలు వ్యాపించాయి. అప్రమత్తమైన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సమయానికి మంటలను ఆర్పి వేయడంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. వంటగదికి పాఠ శాల గదులు దూరంలో ఉండడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో వంటగదిలో వంట సామగ్రి దగ్ధమైంది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి దర్యాప్తు ప్రారంభించారు.

240 బస్తాల బియ్యం పట్టివేత



రాయపోల్ పోలీస్‌స్టేషన్ వద్ద బియ్యం లోడ్‌తో డీసీఎం

రాయపోల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): డీసీఎం వ్యానులో బియ్యాన్ని తరలిస్తుండగా పెట్రోలింగ్ పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన రాయపోల్ మండలం గుర్రాలసోఫా వద్ద చోటుచేసుకుంది. శనివారం రాత్రి అనుమానాస్పదంగా ఉన్న డీసీఎం వ్యానును ఆపి తనిఖీ చేయగా అందులో సుమారు 240 బస్తాల బియ్యం ఐదు టన్నులకు పైగా ఉన్నట్లు గుర్తించారు. డ్రైవర్ సరైన సమాధానం ఇవ్వకపోవడంతో బియ్యంతో పాటు వ్యానును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పౌర సరఫరాల శాఖ అధికారులకు సమాచారం ఇచ్చామని పంచనామా అనంతరం కేసు నమోదు చేస్తామని ఎస్సై మానస తెలిపారు బియ్యం శాంపిల్ పరీక్షలకు పంపించామని, రిపోర్ట్ వచ్చిన తరువాత నిర్ణయం తీసుకుంటామని డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి తెలిపారు.

జర్నలిస్టు కాలనీలో దొంగల హల్‌చల్

- రెండు ఇళ్ల తాళాలు ధ్వంసం
- బైక్, కంప్యూటర్, ఇతర సామగ్రి అపహరణ



జర్నలిస్టులతో మాట్లాడుతున్న ఎస్ఐ అమర్

మెదక్ అర్బన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని డబుల్ బెడ్‌రూం జర్నలిస్టు కాలనీలో అర్ధరాత్రి దొంగలు హల్ చల్ చేశారు. వసరుగా రెండు ఇళ్లల్లో చొరపడ్డారు. స్థానికంగా ఈ ఘటన భయాందోళనకు గురి చేసింది. జర్నలిస్టులు శ్రీధర్ ఇంటి తాళం ధ్వంసం చేసి, ఇంట్లోకి చొరబడి గందరగోళం సృష్టించారు. రాజు ఇంటి తాళం పగలగొటి ఏసీ విండ్, కంప్యూటర్ మానిటర్ ఎత్తుకెళ్లారు. శ్రీనివాస్ ఇంటి పక్కన చెట్టు కింద పార్కు చేసిన బైక్‌ను, శ్యాం ఇంటి ఐరన్ రాడ్స్ ఎత్తుకెళ్లారు. దాంతో జర్నలిస్టులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ అమర్ సంఘటన స్థలాన్ని చేరుకొని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దొంగలను పట్టుకునే పనిలో పడ్డారు.

సండే స్పెషల్
Sunday Special

ప్లంబర్ల కమాల్‌పూర్..
పెయింటర్ల షేర్‌పల్లి

- ఇంటికొకరు చొప్పున ఊరంతా వారే
- ఉపాధి కోసం వలస వెళ్లి.. పని నేర్చుకుని తిరిగి వచ్చిన తమ గ్రామస్తులకు దారి చూపిన వైనం
- భవన నిర్మాణ కార్మికులుగా గుర్తించి, బీమా, పెన్షన్ సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి

మెదక్ జిల్లా నార్సింగి మండలం శేరిపల్లి, సంగారెడ్డి జిల్లా మనూరు మండలం కమలాపూర్ గ్రామాలు నైపుణ్యంతో ప్రత్యేక గుర్తింపు పొందాయి. ఇక్కడివారు ఉపాధి కోసం వలస వెళ్లి, తిరిగి తమ గ్రామస్థులందరికీ పని నేర్పించి, జీవనోపాధి కల్పించడంతో ఆదర్శ గ్రామాలుగా నిలిచాయి.

-తూప్రాన్/చేగుంట/నారాయణఖేడ్/ మనూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి)

మెదక్ జిల్లా శేరిపల్లి పెయింటర్లకు చిరునామాగా మారింది. ఇక్కడ ఊరంతా పెయింటర్లుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. గ్రామంలోని సుమారు 350 నుంచి 400 మంది, ప్రతి ఇంట్లో ఇద్దరు, ముగ్గురు పెయింటర్లు ఈ వృత్తిపైనే ఆధారపడి ఉన్నారు. ఈ గ్రామంలో జనాభా అధికంగా ఉండి, వ్యవసాయ భూమి తక్కువగా ఉండటంతోపాటు, 1998లో కరువు పరిస్థితులు ఏర్పడటం వల్ల గ్రామస్థులు ఉపాధి కోసం ఇతర పనులపై దృష్టి పెట్టాల్సి వచ్చింది. గ్రామానికి చెందిన గజవెల్లి వెంకటేశం మొదటగా హైదరాబాద్‌కు వెళ్లి పెయింటింగ్ పనులు నేర్చుకోగా, ఆ తర్వాత సందిగారి వెంకటస్వామిగౌడ్, కమ్మరి నాగరాజు వంటి వారు శిక్షణ పొంది ఇతరులకు దారి చూపారు. శేరిపల్లి గ్రామస్థులు హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వరకు వెళ్లి పనులు చేస్తుంటారు. గ్రామ సమీపంలోని మిర్జాపల్లి రైల్వేస్టేషన్ నుంచి నిత్యం రైల్లో ఇతర ప్రాంతాలకు పనికి వెళ్లి వస్తుంటారు.

సౌకర్యాలు కల్పించాలని వినతి

అయితే, ఎత్తైన భవనాలకు పెయింటింగ్ చేసేటప్పుడు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. కాజిపల్లి రాజు, బండారి లింగం వంటి పలువురు గాయాలపాలయ్యారు. అత్యంత శ్రమతో కూడుకున్న ఈ పనిలో ఆరోగ్య సమస్యలు (ఆస్తమా, ఊపిరితిత్తుల సమస్యలు) కూడా ఎదుర్కొంటున్నారు. భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం కల్పిస్తున్న బీమా, బెనిఫిట్స్ రామాయంపేట కార్మికశాఖ అధికారి నిర్లక్ష్యం కారణంగా అందడం లేదని, లేబర్ కార్డులు రెన్యూవల్ కావడం లేదని వారు వాపోతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, పెయింటింగ్ పనుల కోసం అధునాతన యంత్రాలు, పరికరాలు అందజేసి ప్రోత్సహించాలని పెయింటర్లు కోరుతున్నారు.





ప్లంబర్ల గ్రామం..

సంగారెడ్డి జిల్లా కమలాపూర్ గ్రామం ప్లంబర్లకు నెలవుగా ఉంది. ఈ గ్రామంలోని దాదాపు 100 కుటుంబాల్లో కనీసం ఒకరు చొప్పున ప్లంబర్‌గా ఉన్నారు. దీంతో ఇది ప్లంబర్ల గ్రామంగా గుర్తింపు తెచ్చుకుంది. గ్రామానికి చెందిన మష్నాజీరావు 40 ఏళ్ల క్రితం ఉపాధి కోసం హైదరాబాద్‌కు వెళ్లి ప్లంబర్‌గా శిక్షణ పొందారు. ఆయన స్వగ్రామానికి తిరిగి వచ్చి, గ్రామంలోని అనేక మందికి ఈ పనిని నేర్పించారు. ప్రస్తుతం ఆయన వద్ద శిక్షణ పొందిన 40 మంది ప్లంబర్లుగా, మరో 40 మంది సహాయకులుగా పనిచేస్తూ జహీరాబాద్, నారాయణఖేడ్ ప్రాంతాల్లో పనులు చేస్తున్నారు. ఆధునిక గృహ నిర్మాణాల్లో ప్లంబర్ల అవసరం పెరగడంతో, మష్నాజీరావు చూపిన మార్గంలో గ్రామస్థులు ఉపాధి పొందుతున్నారు. ఈ గుర్తింపు వల్లే మష్నాజీరావు గతంలో సర్పంచ్‌గా కూడా ఎన్నికయ్యారు. చదువుకున్నా ఉద్యోగాలు రాని యువకులు సైతం మష్నాజీరావు స్ఫూర్తితో ప్లంబర్లుగా స్థిరపడి, తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. వెంకట్, సంజీవ్ వంటి యువకులు ఈ వృత్తి తమకు జీవనాధారం అయిందని సంతోషం వ్యక్తం చేశారు.



శేరిపల్లి గ్రామ పెయింటర్లు



ప్రభుత్వం ఆదుకోవాలి



పెయింటింగ్ పనుల వల్ల వచ్చే ఘాటైన వాసనతో ఊపిరితిత్తులు దెబ్బతినడం, ఆస్తమా లాంటి జబ్బులు వస్తుంటాయి. ప్రభుత్వం వైద్య సహాయం అందించడంతో పాటు, పెన్షన్ సౌకర్యం కల్పించాలి.

- కమ్మరి నాగరాజు, ప్లంబర్

ప్రభుత్వం ఆదుకోవాలి..



పెయింటర్లుగా పనులు చేస్తున్న తమను ప్రభుత్వం ఆదుకోవాలి. ఇంత కష్టపడుతున్న ప్రభుత్వ పరంగా గుర్తింపు లేకుండా పోయింది. అధునాతన యంత్రాలు, పరికరాలు అందజేసి, కార్మికులను గుర్తించాలి.పెయింటింగ్ పరికరాలు అందజేస్తు ప్రోత్సహించాలి.

- వెంకటస్వామిగౌడ్, పెయింటర్

ఎంతోమందికి నేర్పించాను...



తాను ఉపాధి కోసం వలస వెళ్లి, ప్లంబర్‌గా శిక్షణ పొంది స్వగ్రామంలోని అనేక మందికి పని నేర్పించడంతో నాకు గుర్తింపు లభించింది. ప్లంబర్‌గా పొందిన గుర్తింపు వల్లే తాను సర్పంచ్‌గా ఎన్నికయ్యాను.

-మష్నాజీరావు, గ్రామ మొదటి ప్లంబర్

కుటుంబాలను పోషించుకుంటున్నాం..



గృహాలు నిర్మించుకుంటున్న వారి అవసరాలకు అనుగుణంగా పనులు చేస్తున్నాం. ప్లంబర్‌గా కుటుంబాలను చక్కగా పోషించుకుంటున్నాం.

- దోండిరావు, ప్లంబర్

గడిపెద్దాపూర్‌లో మొసళ్ల కలకలం

రెండు చెరువుల్లో ప్రత్యక్షం.. అప్రమత్తంగా ఉండాలని దండోరా



గడిపెద్దాపూర్‌లోని చెరువుల్లో కనిపించిన మొసళ్లు

అల్లాదుర్గం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్‌లో వారం రోజులుగా మొసళ్లు కలకలం రేపుతున్నాయి. వారం క్రితం గ్రామ సమీపంలోని పెద్దచెరువులో మొసలి సంచరించడన్ని గ్రామస్థులు గుర్తించారు. తాజాగా గ్రామంలోని చిన్న చెరువులోనూ మొసలి ప్రత్యక్షం కావడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. శనివారం ఉదయం వ్యవసాయ పనులు చేసుకునేందుకు రైతులు చిన్న చెరువు మీదుగా వెళ్తున్న క్రమంలో చెరువులో సంచరిస్తున్న మొసలి వీరి కంటపడింది. వారం క్రితం పెద్ద చెరువులో మొసలి కనిపించిందని, అది చిన్న చెరువులోకి వచ్చిందా? లేక రెండు చెరువుల్లోనూ మొసళ్లు ఉన్నాయా? అని ఆందోళన చెందుతున్నారు. మొసళ్ల సంచారంపై మాజీ ఎంపీటీసీ విఠల్‌రెడ్డి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దండోర వేయించారు

24న క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు



మల్లికార్జున్

సిద్దిపేట నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24న అండర్ 14 సిద్దిపేట జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు క్రికెట్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా కార్యదర్శి కలకుంట్ల మల్లికార్జున్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిద్దిపేట పట్టణంలోని ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియంలో పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 01-09-2011 నుంచి 3108-2013 తర్వాత జన్మించిన వారు అర్హులని, యూనిఫాం, క్రికెట్ కిట్లు, ఇతర క్రీడా సామగ్రితో హాజరు కావాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సిద్దిపేట జిల్లా క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

భగవన్నామస్మరణతోనే ఆధ్యాత్మిక చింతన

- జగద్గురు శ్రీ సత్యాత్మతీర్థ స్వామి
- వైభవంగా మూల రామ దేవుడు, సీతాదేవి పూజలు

కంది, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : భగవన్నామస్మరణతోనే ఆధ్యాత్మిక చింతన లభిస్తుందని జగద్గురు సత్యాత్మతీర్థ స్వామి తెలిపారు. సంగారెడ్డి జిల్లా కందిలో శనివారం జగద్గురు మన్ మధ్వాచార్య మూల మహాసంస్థాన్ శ్రీమద్ ఉత్తరాధి మఠాధిశ 1008 సత్యాత్మతీర్థ స్వామిజీ సమక్షంలో మూల రామ దేవుడు, మూల సీతాదేవి పూజలు ఘనంగా నిర్వహించారు. రుక్మిణి పాండురంగ స్వామి ఆలయ ధర్మకర్తలు దీపక్ దేశ్‌ముఖ్, సునీల్ దేశముఖ్‌ల ఆధ్వర్యంలో జిల్లా బ్రాహ్మణ సంఘం సభ్యులు స్వామీజీకి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామీజీకి భక్తి శ్రద్ధలతో పాదపూజ సేవ చేశారు. ఈ సందర్భంగా సత్యాత్మతీర్థ స్వామి భక్తులు, వేద పండితులకు ఆధ్యాత్మిక ప్రవచనాలు బోధించారు. కార్యక్రమంలో దీపక్ దేశ్‌ముఖ్, సునీల్ దేశముఖ్ పండితులు మధుసూదన్‌రావ, సురేష్, విజయ్, నవీన్, జిల్లా బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తున్న జగద్గురు సత్యాత్మతీర్థ స్వామి

కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలి

- ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కళింగ క్రిష్ణకుమార్

నారాయణఖేడ్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని, అప్పుడే ఉన్నతస్థాయికి ఎదగగలుగుతామని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కళింగ క్రిష్ణకుమార్ అన్నారు. శనివారం ఖేడ్ పట్టణంలోని జీవన్ ఫంక్షన్‌హాల్‌లో ఇంపాక్ట్, లయన్స్‌క్లబ్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వ్యక్తిత్వ వికాస ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే చదువుతో పాటు స్థానిక పరిస్థితుల పట్ల అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు రఫీ, భాస్కర్ యోగి, జాన్, ఐఆర్ఎస్ అధికారి సుధాకర్‌నాయక్, లయన్స్‌క్లబ్, ఇంపాక్ట్ స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళింగ క్రిష్ణకుమార్

నూతన విత్తన చట్టంపై అవగాహన

సంగారెడ్డి రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విత్తన చట్టంపై సంగారెడ్డి కలెక్టరేట్‌లో శనివారం వ్యవసాయ అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నూతన విత్తన చట్టం -2025 ద్వారా దేశవ్యాప్తంగా రైతులకు నాణ్యమైన విత్తనాలు, నర్సరీ మొక్కలు అందుబాటులోకి తేవాలన్నారు. నకిలీ విత్తనాల నియంత్రణ, విత్తనాల దిగుమతుల సరళీకరణ, రైతుల హక్కుల పరిరక్షణ లాంటి అంశాలకు ప్రాధాన్యమిచ్చినట్లు తెలిపారు. ఉల్లంఘనలు జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేలా చట్టంలో పలు నిబంధనలు చేర్చినట్లు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, రైతు విజ్ఞాన కేంద్ర కో ఆర్డినేటర్ రాభుల్ విశ్వకర్మ, మంజీర రైతు సంఘం అధ్యక్షుడు పృథ్వీరాజ్, రైతు రక్షణ సమితి అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, సీడ్ సర్టిఫికేషన్ విభాగం డైరెక్టర్ శివప్రసాద్, హర్టికల్చర్ అధికారిణి స్పందన తదితరులు పాల్గొన్నారు.



నూతన విత్తన చట్టంపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ జేడీ శివప్రసాద్

విద్యార్థికి యువ శాస్త్రవేత్త అవార్డు



శాస్త్ర వేత్త అవార్డును అందుకుంటున్న విద్యార్థి

పాపన్నపేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : పాపన్నపేట మండలం చీకోడ్ - లింగాయిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థికి యువశాస్త్ర వేత్త అవార్డు లభించింది. పదో తరగతి విద్యార్థి శివచైతన్య రూపొందించిన మోడ్రన్ మల్టిపర్పస్ అడ్వాన్స్ హైడ్రాలిక్ అనే ఆవిష్కరణ ఇటీవల ఎన్‌సీఆర్టీ ద్వారా జాతీయ స్థాయికి ఎంపికైంది. ఈ మేరకు శనివారం మధ్యప్రదేశ్ భోపాల్‌లో నిర్వహించిన ప్రదర్శనలో పాల్గొని ప్రతిభ కనబర్చి 'పర్యావరణ్ సంస్కృతి సంరక్షణ్, ఎవం మానవ్ కల్యాణ్ ట్రస్ట్" నుంచి యువ శాస్త్రవేత్త అవార్డు అందుకున్నాడు. ఈ సందర్భంగా విద్యార్థిని, గైడ్ ఉపాధ్యాయుడు కిషన్ ప్రసాద్‌ను ఉపాధ్యాయ బృందం, మండల వాసులు అభినందించారు.

క్రైం కార్నర్

ట్రాక్టర్‌ను ఢీకొని యువకుడి మృతి



శ్యామ్ (ఫైల్)

మద్దూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్‌ను ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన మద్దూరు మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన సింగారం చంద్రయ్య పెద్ద కుమారుడు సింగారం శ్యామ్(29) కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం రాత్రి తన బైక్‌పై ఇంటి నుంచి మద్దూరులోని చౌరస్తాకు వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో ఎస్సీకాలనీ సమీపంలో రోడ్డు మధ్యలో నిలిపి ఉంచిన లద్నూరు గ్రామానికి చెందిన అప్పాల సురేష్‌కు చెందిన ట్రాక్టర్‌ను ప్రమాదవశాత్తు ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలపాలైన అతడిని మొదట చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం సిద్దిపేటలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

కుటుంబ సభ్యుల, బంధువుల ధర్నా



చౌరస్తాలో మృత దేహంతో ఆందోళనకు దిగిన కుటుంబ సభ్యులు

ఎలాంటి హెచ్చరికలు లేకుండా రోడ్డుపై ట్రాక్టర్‌ను నిలిపి శ్యామ్ మృతి కారణమైన ట్రాక్టర్ యజమానిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు మద్దూరు అమరవీరుల స్థూపం చౌరస్తాలో ధర్నాకు దిగారు. సమాచారం అందుకున్న హుస్నాబాద్ ఏసీపీ సదానందం, చేర్యాల సీఐ శ్రీను, ఎస్ఐ షేక్ మహబూబ్ అలీ సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని చేరుకుని ఆందోళన చేస్తున్న శాంతింపజేసే ప్రయత్నం చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, లేదంటే ట్రాక్టర్ యజమానిని తమకు అప్పగించాలంటూ బైఠాయించారు. ట్రాక్టర్ యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ షేక్ మహబూబ్‌అలీ హామీ ఇచ్చారు. తహసీల్దార్ రహీం మృతుడి కుటుంబానికి ప్రభుత్వం నుంచి రెండు ఎకరాల భూమితో పాటు ఫ్యామిలీబెనిఫిట్ స్కీం వర్తింప జేయనున్నట్లు హామీ ఇచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు.

భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని.. మేనల్లుడిని కారుతో ఢీ కొట్టి చంపిన మామ

కుకునూరుపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడనే కోపంతో ఓ మేనమామ.. సొంత మేనల్లుడిని కారుతో ఢీ కొట్టి హత్య చేశాడు. సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లిలో శనివారం సాయంత్రం జరిగిన ఈ ఘటన వివరాలు ఎస్ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. జిల్లాలోని జగదేవ్‌పూర్ మండలం చాట్లపల్లి గ్రామానికి చెందిన ఒకరి భార్యతో అతని సొంత మేనల్లుడు షాహీద్(26) తరచూ ఫోన్‌లో మాట్లాడేవాడు. దీంతో తన భార్యకు, అతనికి మధ్య వివాహేతర సంబంధం ఉందని మామ తెలువడంతో మానుకోవాలని పలుమార్లు మేనల్లుడి హెచ్చరించాడు. అయినా మానుకోకపోవడంతోపాటు మరోవైపు భార్య కూడా తన భర్తను దగ్గరికి రానివ్వకపోవడంతో మేనల్లుడిని ఎలాగైనా అంతం చేయాలని పథకం వేశాడు. షాహీద్ శనివారం సాయంత్రం కూడా తన అత్తను కలిసి బయటకు వెళ్తుండగా మామ గమనించాడు. అనంతరం షాహిద్ బైక్‌పై కుకునూరుపల్లి మండలం చిన్నకిష్టాపూర్‌నకు రాగా, మామ కారులో వేగంగా వచ్చి ఢీ కొట్టి చంపేశాడు. ఈ మేరకు షాహీద్ కుటుంబసభ్యులు కుకునూరుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. షాహీద్ అవివాహితుడు కాగా, నిందితుడికి ఓ పాప, ఓ బాబు ఉన్నారు.

సుపారీ గ్యాంగ్‌తో హత్యకు ప్లాన్

- ఎనిమిది మంది అరెస్టు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ రవీందర్ రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రవీందర్ రెడ్డి

సిద్దిపేట క్రైం /సిద్దిపేటరూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పొలం దారి విషయంలో చోటుచేసుకున్న గొడవ చివరికి వ్యక్తిని హత్య చేసేవరకు వెళ్లింది. సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట రూరల్ మండలం చిన్నగుండవెల్లి గ్రామానికి చెందిన మాజీ సైనికుడు పోలీస్ శ్రీనివాస్‌రెడ్డికి అదే గ్రామానికి చెందిన పుల్లగుర్ల యెల్లారెడ్డితో పొలం వద్ద దారి విషయంలో భూ వివాదాలు జరుగుతున్నాయి. గ్రామంలో పంచాయితీలు జరిగినప్పటికీ సమస్య కొలిక్కి రాకపోవడంతో శ్రీనివాస్‌రెడ్డి యెల్లారెడ్డిని చంపాలని నిర్ణయించుకుని ఆ విషయాన్ని తన బంధువు సాగర్, అతని స్నేహితుడు భరత్‌కు చెప్పాడు. వారు ఇర్కోడుకు చెందిన పరశురాములును పరిచయం చేయగా హత్యకు ప్లాన్ చేశారు. ఈ మేరకు పరుశరాములకు విడుతలవారీగా రూ.10 లక్షలను ఇచ్చాడు. పరశురాములు తనకు పరిచయం ఉన్న ఫజిల్, కాస స్వామిలను సంప్రదించి యెల్లారెడ్డిని కారు యాక్సిడెంట్‌లో హత్య చేయాలని చెప్పి రూ.2 లక్షలను అందజేసాడు. వారితో పాటు అనిల్, అంజిబాబు, దుర్గాప్రసాద్, మల్లికార్జున్ డ్రైవర్లను జత కలుపుకున్నారు. వారికీ ముందస్తుగా డబ్బులు చెల్లించి కారును అద్దెకు తెప్పించి అక్టోబర్ 22 రాత్రి రెండు ప్రయత్నాలు చేసి విఫలమయ్యారు. మూడవ సారి యెల్లారెడ్డి బైకును వెనుక నుంచి ఢీ కొట్టినా అతడు బతికి బయట పడడంతో కారును అంజిబాబు ఇంట్లో దాచారు. తిరిగి శనివారం ఉదయం పరశురాములు, స్వామి, ఫాజిల్, శ్రీనివాస్‌రెడ్డి కలిసి మళ్లీ యెల్లారెడ్డిని చంపే ప్లాన్ చేస్తుండగా పోలీసులు దాడి చేసి వారితో పాటు అందులో సంబంధం ఉన్న జక్కుల దుర్గాప్రసాద్, అనిల్, పిల్లిట్ల అంజిబాబు, మేఘరాజు మల్లికార్జున్‌లను అరెస్టు చేశారు. ఇర్కోడుకు చెందిన సాగర్, భరత్‌లు పరారీలో ఉన్నట్లు తెలిపారు. పట్టుబడ్డ వారి నుంచి 8 ఫోన్లు, మారుతి కారును స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. సమావేశంలో సీఐ శ్రీను, ఎస్ఐ రాజేష్, సిబ్బంది రాజు, సుభాష్, విష్ణు, ప్రవీణ్, రాజు తదితరులు పాల్గొన్నారు

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



మధు (ఫైల్)

చేగుంట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నార్సింగ్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. నార్సింగ్ ఎస్సై సృజన స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఎరుగ మోల్ల మధు(38) కుటుంబ పోషణ కోసం చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపం చెంది ఇంట్లో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు మృతుడికి భార్య శ్యామల, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. భార్య శ్యామల ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

న్యూస్ బాక్స్

బట్టి జగపతికి హరీశ్‌రావు పరామర్శ

మెదక్ మున్సిపాలిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ మాజీ చైర్మన్ బట్టి జగపతిని మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి పరామర్శించారు. రెండురోజుల క్రితం మెదక్ పట్టణంలోని ఆయన నివాసంలో గాయపడి నగరంలోని అపోలో ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే. కాలికి బలమైన గాయం కావడంతో డాక్టర్లు ఆపరేషన్ చేశారు. విషయం తెలుసుకున్న వారు శనివారం సాయంత్రం ఆస్పత్రికి చేరుకొని జగపతిని పరామర్శించారు.

అంగన్‌వాడీ టీచర్లు నైపుణ్యాలను పెంచుకోవాలి

నారాయణఖేడ్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీల టీచర్లు తమ నైపుణ్యాలను పెంచుకోవాలని ఖేడ్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో సుజాత అన్నారు. శనివారం ఖేడ్‌లో అజీం ప్రేమ్‌జీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తరంగిణి పేరిట ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు టీఎల్ఎం మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనుభవాలను పంచుకుంటూ నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. ప్రతీ టీచర్ 20 టీఎల్ఎం మెటీరియల్స్‌తో బోధన అభ్యాస సామగ్రిని ప్రదర్శించారు.

బాల్య వివాహాలు నేరం

చిన్నశంకరంపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని విజన్ ఎన్జీవో ప్రతినిధి యాదగిరి అన్నారు. శనివారం చిన్నశంకరంపేట మండల పరిధిలోని కోర్విపల్లి గ్రామంలో బాల్య వివాహాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు.

మండల పరిషత్ విధులపై అవగాహన

చేగుంట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక స్వయంపాలన వ్యవస్థలో మండల పరిషత్ పాత్ర, బాధ్యతలు, అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు చేగుంట మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం ఉపాధ్యాయులు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు ప్రజాప్రతినిధుల బాధ్యతలపై ఎంపీవో ప్రశాంత్ అవగాహన కల్పించారు.

పర్యావరణం దినోత్సవం

పెద్దశంకరంపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ కోసం పెద్దశంకరంపేట శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో ప్రధాన ఆచార్యులు లక్ష్మీనారాయణ ఆచార్య బృందం అవగాహన కల్పించారు. శనివారం సరస్వతీ శిశుమందిర్‌లో విద్యార్థులు పర్యావరణ దినోత్సవం జరుపుకున్నారు. విద్యార్థులు కాగితపు పేపర్లతో చేతి సంచులను తయారు చేశారు.

శ్రీదేవి ట్రేడర్స్‌లో చోరీ

రామాయంపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రామాయంపేట పట్టణంలోని శ్రీదేవి ట్రేడర్స్‌లో చోరీ జరిగింది. శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు బద్దలు కొట్టి కౌంటర్‌లోని రూ.6 వేలను ఎత్తుకెళ్లారు. బాధితుడు శ్రీనివాస్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలరాజ్ తెలిపారు.

రేపు సంగారెడ్డి, సిద్దిపేటలో క్రికెట్ జట్టు ఎంపికలు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24న సంగారెడ్డి, సిద్దిపేటలలో క్రికెట్ జట్టు ఎంపికలు నిర్వహించనున్నట్టు మెదక్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రాజేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14 ఇంట్రా డిస్ట్రిక్ట్ క్రికెట్ లీగ్ పోటీల్లో పాల్గొనే ఆరు జట్లను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. సంగారెడ్డిలోని జూబ్లీక్లబ్ ప్రాంగణంలోని ఎంఎస్ అకాడమీలో, సిద్దిపేటలో ప్రొఫెసర్ జయశంకర్ మినీ స్టేడియంలో ఎంపికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. డిసెంబరు మొదటివారంలో ప్రారంభమయ్యే ఇంటర్ స్కూల్స్‌తో పాటు జిల్లాల టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు బర్త్ సర్టిఫికేట్, ఆధార్‌కార్డు, బోనాఫైడ్, రెండు ఫొటోలతో హాజరుకావాలని సూచించారు.

మండలానికి 12,602 ఇందిరమ్మ చీరలు

హత్నూర/తూప్రాన్/చేగుంట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): హత్నూర మండలంలోని ఆయా గ్రామాల మహిళలకు పంపిణీ చేసేందుకు 12,602 ఇందిరమ్మ చీరలు సిద్ధంగా ఉన్నాయని ఐకేపీ ఏపీఎం రాజశేఖర్ తెలిపారు. 38 గ్రామపంచాయతీల్లో మహిళలందరికీ ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలిపారు. అలాగే తూప్రాన్ మండలానికి 3,389 ఇందిరమ్మ చీరలు వచ్చాయని, రేపటి నుంచి పంపిణీ చేసేందుకు అధికారులు సిద్ధం చేశారని ఐకేపీ ఏపీఎం వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ చీరలను మహిళా సమాఖ్య నేడు చేగుంట మండలంలోని పలు గ్రామాల్లో పంపిణీ చేయనున్నారని తహసీల్దార్ శివప్రసాద్, ఎంపీడీవో చిన్నారెడ్డి, ఏపీఎం దుర్గాప్రసాద్, సీసీలు శంకర్, శ్వేత, స్వామి తెలిపారు.

ప్రకృతి రమణీయం.. ఆధ్యాత్మిక శోభితం

- నర్సాపూర్‌కే ప్రత్యేకతంగా నిలవనున్న అయ్యప్ప ఆలయం
- దాతల సహకారంతో నిర్మాణం పూర్తి
- 23 నుంచి 26 వరకు ప్రతిష్ఠాపనలు



ప్రతిష్ఠోత్సవాలకు ముస్తాబైన ఆలయం, ఆలయ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోనే ఎక్కడా లేనివిధంగా ప్రకృతి రమణీయమైన చోట ఆకట్టుకునే విధంగా నర్సాపూర్ అటవీ ప్రాంతానికి అతి సమీపంలో అయ్యప్ప ఆలయం కొలువు దీరనున్నది. జాతీయ రహదారి 765డీకి ఆనుకుని దాతల సహకారం రూ.2 కోట్లతో ఆలయాన్ని తీర్చిదిద్దారు. ఈనెల 23 నుంచి ఇక్కడ ప్రతిష్ఠోత్సవాలు నిర్వహించేందుకు నిర్వాహక కమిటీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ప్రత్యేక దృష్టిసారించి ఎప్పటికప్పుడు అవసరమైన సహకారం అందిస్తున్నారు. శనివారం కూడా ఆలయ ప్రతిష్ఠోత్సవాల ఏర్పాట్లను ఎమ్మెల్యే సునీతారెడ్డి పరిశీలించి, త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని నిర్వహణ కమిటీ ప్రతినిధులకు సూచించారు. ఇక్కడ అయ్యప్ప పంచలోహ విగ్రహంతో పాటు ఆదిపరాశక్తితో పాటు ఇతర దేవతా మూర్తుల విగ్రహాలను కూడా ప్రతిష్ఠించనున్నారు. ఇందులో భాగంగా 23న సాయంత్రం ఆదిపరాశక్తి, అయ్యప్పస్వామితో పాటు ఇతర దేవతామూర్తుల విగ్రహాలను పట్టణంలోని పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించనున్నారు. 24, 25న ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు ప్రారంభంకానున్నాయి. 26న దేవతామూర్తుల ప్రతిష్ఠ తెల్లవారుజామున నుంచి నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యేలు సునీతారెడ్డి, హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తదితరులు హాజరుకానున్నట్లు నిర్వహణ కమిటీ అధ్యక్షుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ తెలిపారు.

ఆలయం నర్సాపూర్‌కే ప్రత్యేకతను తేనుంది

నర్సాపూర్‌లో ప్రతిష్ఠాత్మకంగా నిర్మాణమైన అయ్యప్ప ఆలయం నర్సాపూర్‌కే ప్రత్యేకతను చాటనున్నది. దాతల సహకారంతో అయ్యప్పస్వాములు ప్రత్యేక కృషితో ఈ ఆలయం ఉమ్మడిజిల్లాలోనే ఎక్కడాలేని విధంగా నిర్మాణం జరిగింది. ఈ ఆలయం వల్ల ఈ ప్రాంతం పర్యాటకపరంగా మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

\- ఎమ్మెల్యే సునీతారెడ్డి

ఆయిల్‌పామ్ సాగుతో నిరంతర ఆదాయం

- ఎమ్మెల్యే మాణిక్‌రావు


ఆయిల్‌పామ్ మొక్కలను నాటుతున్న మాణిక్‌రావు

జహీరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్‌పామ్ మొక్కలను సాగు చేసుకోవడం వల్ల నిరంతరం ఆదాయం వస్తుందని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. శనివారం జహీరాబాద్ మండల పరిధిలోని రంజోల్ గ్రామంలో ఓ రైతు పొలంలో మొక్కలు నాటి మాట్లాడారు. ఓ యేట ఆయిల్‌పామ్ మొక్కలను నాటడం వల్ల రైతులకు 30 ఏళ్ల వరకు ఆదాయం వస్తుందన్నారు. ఈ పంటలో అంతర పంటలైన సోయా, శనగ, పెసర, మినుము పంటలను కూడా సాగు చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సోమేశ్వరరావు, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, నాయకులు మశ్చేందర్, నారాయణ, వెంకటేశం, బండి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు నందిగామ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరు మండలం నందిగామ గ్రామానికి చెందిన పట్లోళ్ల ఆర్యన్‌రెడ్డి, తీర్థ వికారాబాద్‌లో జరిగిన అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు. ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐ వినాయకరెడ్డి, హనుమంతురెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

రోగుల పట్ల మర్యాదగా ప్రవర్తించండి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వసంతరావు
- డీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ


నిజాంపేటలోని పీహెచ్‌సీ మందుల నిల్వలు పరిశీలిస్తున్న వసంతరావు

నారాయణఖేడ్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వసంతరావు అన్నారు. ఖేడ్ పరిధి మండల కేంద్రమైన నిజాంపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది వివరాలను పరిశీలించడమే కాకుండా రికార్డులు, వైద్యులు, సిబ్బంది హాజరు రిజిష్టర్లను పరిశీలించారు. ఫార్మసీ స్టోర్‌లో మందుల నిల్వలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోగుల పట్ల మర్యాదగా వ్యవహరించడమే కాకుండా సమయపాలన పాటిస్తూ.. పీహెచ్‌సీలో ప్రసవాలు చేయడంతో పాటు ఎన్‌సీడీ, లెప్రసీ, టీబీ ప్రోగ్రాంలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఆయన వెంట వైద్యాధికారి డాక్టర్ అరవింద్, ఫార్మాసిస్టు జబ్బార్, అప్తాలమిక్ అధికారి లక్ష్మీనారాయణ, ఆరోగ్య సహాయకులు జట్ల భాస్కర్, పరశురాం, స్టాఫ్‌నర్స్ సునీత ఉన్నారు. సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య అధికారిగా వసంతరావు బాధ్యతలు చేపట్టాక మొదటిసారి నారాయణఖేడ్‌కు రావడంతో క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో సన్మానించారు.

సమాజం పట్ల సేవాభావం కలిగి ఉండాలి

- మెదక్ అదనపు ఎస్పీ మహేందర్


విద్యార్థులకు క్యాంపు పత్రాలు అందజేస్తున్న అదనపు ఎస్పీ

పాపన్నపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సమాజం పట్ల సేవాభావం కలిగి ఉండాలని మెదక్ అదనపు ఎస్పీ మహేందర్ అన్నారు. శనివారం మండల పరిధి మల్లంపేట గ్రామంలో వారంరోజుల పాటు నిర్వహించిన ఎన్ఎస్ఎస్ క్యాంపు ముగింపులో పాల్గొని మాట్లాడారు. సమాజానికి తమవంతు సేవ చేయడం జీవితంలో ఎంతో తృప్తిని కలిగిస్తుందన్నారు. ఎన్ఎస్ఎస్ లాంటి శిబిరాలు క్రమశిక్షణ, అంకితభావాన్ని పెంపొందిస్తాయన్నారు. అనంతరం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి మాధవి మాట్లాడుతూ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ క్యాంపు ద్వారా నేర్చుకున్న అంశాలు భవిష్యత్తులో చాలా ఉపయోగపడుతాయన్నారు. అనంతరం క్యాంపు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నర్సింలు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి జూలకంటి శ్రీనివాస్, అధ్యాపకులు సంతోష్‌కుమార్, ప్రవీణ్, సంతోష్, నవీన్, కాంగ్రెస్ నాయకుడు ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను కాలగర్భంలో కలిపిన మోదీ

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు


సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట కార్మికులతో కలిసి ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

సంగారెడ్డి రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సుదీర్ఘ కాలం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోదీ కాలగర్భంలో కలిపారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ.సాయిలు విమర్శించారు. సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట శనివారం కార్మికులతో కలిసి సీఐటీయూ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చి కార్పొరేటర్లకు మోదీ ఊడిగం చేస్తున్నారన్నారు. ఈ ధర్నాలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మాణిక్యం, నాయకులు ప్రసన్న రావు, ప్రవీణ్, రాందాస్, దయానంద్, పరమేశ్వర్, నాగభూషణం, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, పాండు, చంద్రయ్య, కార్మికులు పాల్గొన్నారు.

●జిన్నారం: కాజీపల్లి పారిశ్రామికవాడలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నాలుగు కార్మిక కోడ్లకు వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

●పటాన్‌చెరు : నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పాండురంగారెడ్డి, నాగేశ్వరరావు, ఎండీ.వాజిద్‌అలీ డిమాండ్ చేశారు. శనివారం పటాన్‌చెరు శ్రామిక్‌భవన్ నుంచి కూడలి వరకు ర్యాలీ నిర్వహించి, లేబర్ కోడ్ జీవో పత్రాలను తగలబెట్టారు.


●జహీరాబాద్: జహీరాబాద్ పట్టణంలో సీఐటీయూ పారిశ్రామిక క్లస్టర్ కన్వీనర్ మహిపాల్ ఆధ్వర్యంలో జీవో పత్రాలను దహనం చేశారు.

ప్రత్యేక తరగతులు నిర్వహించాలి

- సంగారెడ్డి జిల్లా గిరిజన సంక్షేమాధికారి వెంకటేష్

నారాయణఖేడ్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతిలో ఉత్త ఫలితాలు సాధించడం కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను సన్నద్ధం చేయాలని సంగారెడ్డి జిల్లా గిరిజన సంక్షేమాధికారి వెంకటేష్ సూచించారు. శనివారం ఆయన ఖేడ్ పట్టణ శివారులో గిరిజన బాలికల వసతి గృహం, గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజన సదుపాయాలు, విద్యాబోధన వివరాలను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని వసతి గృహ సంక్షేమ అధికారి బాలమణికి సూచించారు.

విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో ముందుకెళ్లాలి


సమావేశంలో మాట్లాడుతున్న చంద్రకళ


నర్సాపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సమస్యలను అధిగమిస్తూ ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని మెదక్ జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ చంద్రకళ పేర్కొన్నారు. నర్సాపూర్ సమీపంలోని విష్ణుఫార్మసీ కాలేజీలో శనివారం జాతీయ ఫార్మసీ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మారుతున్న కాలానుగుణంగా ఫార్మసీ రంగానికి ఎంతో ప్రాధాన్యం పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కెమిస్టు అండ్ డ్రగిస్టు నియోజకవర్గ నర్సాపూర్ అధ్యక్షుడు జి.శ్రీనివాస్, కోశాధికారి ఎం.శ్రీనివాస్, ప్రిన్సిపాల్ రమేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

మల్లన్న జాతరకు రావాలని హరీశ్‌రావుకు ఆహ్వానం

నారాయణఖేడ్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అనంతసాగర్‌లో 30న నిర్వహించనున్న మైలారం మల్లన్నస్వామి కల్యాణం, జాతరకు హాజరుకావాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, ఖేడ్ బీఆర్ఎస్ నాయకులు కోరారు. శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్వర్, అనంత్‌సాగర్, నాయకులు ఉన్నారు.

పోలీస్‌శాఖలో ఫిజికల్ ఫిట్‌నెస్ కీలకం

- సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్


వీక్లీ పరేడ్ నిర్వహిస్తున్న పోలీసులు

సంగారెడ్డి క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పోలీసులకు ఫిజికల్ ఫిట్‌నెస్ కీలకమని ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులకు సంగారెడ్డిలోని జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో శనివారం వీక్లీ పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌శాఖలో శారీరకంగా, మానసికంగా ఫిట్‌గా ఉన్నప్పుడే ఎలాంటి పరిస్థితులలోనైనా సమర్థవంతంగా విధులను నిర్వర్తించగలమన్నారు. జిల్లా ఆర్మ్‌డ్ సిబ్బందితో పాటు సివిల్ సిబ్బందికి వీక్లీ పరేడ్ నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు శ్రీనివాస్‌రావు, రాజశేఖర్‌రెడ్డి, డానియల్ తదిరులు పాల్గొన్నారు.

విద్యారంగంలో గిరిజనుల అభివృద్ధి భేష్

నారాయణఖేడ్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగంలో గిరిజనుల అభివృద్ధి అమోఘమని ఎస్పీ పారితోష్ పంకజ్ అన్నారు. శనివారం నారాయణఖేడ్ మండల పరిధిలోని అబ్బెంద కింది తండా ప్రాథమిక పాఠశాలలో ఐఆర్ఎస్ సుధాకర్ నాయక్ ఆధ్వర్యంలో సర్వోదయ ఫౌండేషన్ ద్వారా రూ.2.50 లక్షలతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకట్‌రెడ్డి, ఐఆర్ఎస్ సుధాకర్ నాయక్, మాజీ ఎంపీపీ జీవ్లనాయక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కేతకీ సంగమేశ్వర ఆలయ డైరెక్టర్ ఈశ్వరప్ప, పీఏసీఎస్ చైర్మన్ శోభఅశోక్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ శ్రీశైలం, ప్రభాకర్‌రెడ్డి, ఎంఈవో విశ్వనాథ్, జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి, హెచ్ఎం యాదవరెడ్డి పాల్గొన్నారు.

సిర్గాపూర్ పోలీస్‌స్టేషన్‌లో తనిఖీ

కల్హేర్/సిర్గాపూర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : సిర్గాపూర్ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ పరితోష్ పంకజ్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీసు సిబ్బందికి నిర్మించిన క్వార్టర్స్‌ను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలోని ఖాళీ స్థలానికి ఆనుకుని ఉన్న స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విస్తరణ కోసం భవనాల నిర్మాణం అవసరమగు స్థలాన్ని కేటాయించాలని విద్యాశాఖ అధికారులు పోలీసుశాఖకు విన్నవించుకోగా.. ఈ మేరకు వారికి స్థలం కేటాయింపు సాధ్యాసాధ్యాలను ఎస్పీ పరిశీలించారు. ఆయన వెంట నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, కంగ్టి సీఐ వెంకట్‌రెడ్డి, సిర్గాపూర్ ఎస్ఐ మహేష్ ఉన్నారు.

పటాన్‌చెరులో 'ఢీ'ఆర్ఎస్

(5వ పేజీ తరువాయి)

పంచాయతీ ఎన్నికల సమన్వయకర్తల నియామకం చేపట్టారు.

గుమ్మడిదల మండలంలోని ఎనిమిది గ్రామాలకు ఎన్నికల ఇన్‌చార్జిలుగా గోవర్ధన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, పరిశీలకులుగా కొలన్‌బాల్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, పటాన్‌చెరు మండలంలోని మూడు గ్రామాలకు ఇన్‌చార్జిలుగా మెట్టుకుమార్‌యాదవ్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు శ్రీకాంత్‌గౌడ్, పరిశీలకులుగా తెల్లాపూర్ మాజీ సర్పంచ్ మల్లేపల్లి సోమిరెడ్డి, మాజీ వైస్ చైర్మన్ బాలగోని రాములుగౌడ్, రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంటు అంజయ్యయాదవ్ నియమిస్తూ సమావేశం ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకుంది.

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి


అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

పటాన్‌చెరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి పనులు చేపట్టడానికి వీలుగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ చెప్పారు. శనివారం పటాన్‌చెరులో ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. కాలనీల్లో సీసీరోడ్లు, మురుగు పైపులైన్లు, శ్మశానవాటికకు ప్రహరీ నిర్మాణం, వీధిలైట్లు, వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు వంటి పనులకు రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయాలంటూ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌కు వినతిపత్రం అందించామని తెలిపారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారని అన్నారు. అనంతరం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో ఆశావర్కర్లకు యూనిఫాం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి నేత్రావతి, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఈఈ సురేష్, డీఈ కృష్ణవేణి, ఏఈ శివకుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా ఉత్తర్వులిచ్చిన పాలకవర్గంలో చోటేదీ?

- అధికారులను ప్రశ్నించిన సొసైటీ డైరెక్టర్లు

రామాయంపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సొసైటీ పాలకవర్గంలో తిరిగి మమ్మల్ని ఎందుకు చేర్చలేదని ఇరువురు డైరెక్టర్లు ప్రశ్నించారు. శనివారం ప్రకటన విడుదల చేస్తూ గతనెలలో సొసైటీల గడువు పొడిగింపు జాబితాలో రామాయంపేట పాలకవర్గం లేదన్నారు.దీంతో సొసైటీ చైర్మన్ హైకోర్టుకు వెళ్లగా, స్టే ఆధారంగా ఎనిమిదిమంది సభ్యులకుగాను ఆరుగురిని ఎంపిక చేస్తూ డీసీవో మూడురోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేశారన్నారు. దానిలో తమ ఇద్దరి పేర్లు చేర్చకపోవడమేమిటని డైరెక్టర్లు లద్ద నిర్మల, పోచమ్మల ఐలయ్యలు ఆందోళన వ్యక్తం చేశారు. ఓవైపు ఆ ఆరుగురిలో ఇద్దరు డైరెక్టర్లు సొసైటీలో అప్పు కట్టాల్సి ఉండగా..ఎలాంటి బాకీ లేని తమ ఇద్దరి పేర్లను తొలగించడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని తాము ఇప్పటికే డీసీవో దృష్టికి తీసుకెళ్లామన్నారు. తమకు న్యాయం జరగకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయనున్నట్లు స్పష్టం చేశారు.

అయ్యమ్మ చెరువులోకి రసాయన వ్యర్థాలు


గడ్డపోతారంలో పారిశ్రామికవాడ నుంచి అయ్యమ్మ చెరువులోకి ప్రవహిస్తున్న రసాయన జలాలు

జిన్నారం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గడ్డపోతారం పారిశ్రామికవాడ నుంచి స్థానిక అయ్యమ్మ చెరువులోకి భారీగా రసాయన వ్యర్థాలు చేరడంతో స్థానికులు పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అధికారులు శనివారం చెరువు పైభాగంలోని పలు పరిశ్రమల నుంచి రసాయన వ్యర్థాలు చెరువులో చేరుతుండడాన్ని గమనించారు. దీంతో పీసీబీ అసిస్టెంట్ సైంటిస్ట్ ఆసియా బేగం, ఇతర అధికారులు వ్యర్థ జలాల నమూనాలు సేకరించారు. చెరువు నీటిని కాలుష్యం చేస్తున్న పరిశ్రమలను గుర్తించి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు.

ఇక్రా స్కూల్లో ఘనంగా ఫుడ్ ఫెస్టివల్

- 150 రకాల వంటలతో ఆకట్టుకున్న విద్యార్థులు


ఫుడ్ ఫెస్టివల్‌లో వంటలను పరిశీలిస్తున్న దర్గా మాజీ అధ్యక్షుడు ఖాజాఖాన్

కంది, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కందిలోని ఇక్రా స్కూల్లో శనివారం ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహించారు. ప్రిన్సిపల్ నాసిర్ హుస్సేన్ ఆధ్వర్యంలో సుమారు 150 రకాల వంటకాలను విద్యార్థులచే వండించి ఫెస్టివల్‌లో ప్రదర్శించారు. చిన్నారులు చేసిన పానీ పూరి, షీర్ కుర్మా, పోషకాహారలతో కూడిన స్నాక్స్‌ను అందరూ రుచి చూశారు. విద్యార్థులకు చదువుతో పాటే మేధస్సును పెంచుకునేందుకు ఇలా ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ నాసిర్ హుస్సేన్ తెలిపారు. ఈ ఫుడ్ ఫెస్టివల్‌లో విద్యార్థుల తల్లిదండ్రులు, ఫతేఖాన్ దర్గా మాజీ అధ్యక్షుడు ఖాజాఖాన్, ఆజాం, అఫ్సర్, అన్వర్, జుబేర్, ఆబేద్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి బాలవిహార్ పార్కు

రామచంద్రాపురం టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కాలనీవాసులు ఆస్వాదించడానికి పార్కుల నిర్మాణాలు చేపడుతున్నామని కార్పొరేటర్ పుష్పానగేష్ అన్నారు. శనివారం రామచంద్రాపురం డివిజన్ పరిధి శ్రీనివాసనగర్ బాలవిహార్ పార్కు అభివృద్ధి పనులు పర్యవేక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రూ.3.5 కోట్లతో పార్కును అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ ఏఈ కృష్ణవేణి, ట్రాన్స్‌కో ఏఈ లిఖిత, కేశవులు, మల్లేష్, శ్రీనివాస్‌రాజు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

నారాయణఖేడ్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ పక్కా గృహాలు నిర్మించి ఇచ్చేందుకే ప్రభుత్వం ఇందిరమ్మ పథకాన్ని చేపట్టిందని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ అన్నారు. శనివారం నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేటలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్‌తో కలిసి ఆయన లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. గృహాలు నిర్మించుకునే వారికి ఇసుకను ఉచితంగా ఇస్తున్నామన్నారు. మొదటి జాబితాలో అర్హుల పేర్లు లేకపోయినా విడతలవారీగా అర్హులందరికీ మంజూరవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ క్రిష్ణ, నాయకులు బాలయ్య, యాదగిరి, విఠల్ పాల్గొన్నారు.